## వికసిత్ భారత్‌కు పిల్లలు పునాది

### - పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



వికసిత్ భారత్‌కు పిల్లలు పునాది అని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. భారత బాలశక్తి అట్ 2047 వేడుకలు అమలులో భాగంగా శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ వీర్ బాల్ దివస్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత భవిష్యత్తుకు మూతస్తంభాలైన బాలలను గౌరవిస్తూ వారిలో స్ఫూర్తిని నింపడమే వీర్ బాల్ దివస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. దేశ భవిష్యత్తుకు పునాది అయిన పిల్లలను గౌరవించడానికే ఈ వేడుకలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు




## తిరుపతి జిల్లాను ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యం

### జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ఫై (ఆర్.టి.ఐ హెచ్)పై బోర్డు డైరెక్టర్లతో కలసి శనివారం కలెక్టర్ మిని కాన్ఫిరెన్స్ హాలులో జరిగిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతిని ఎలక్ట్రానిక్స్, స్పేస్ , అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సిస్టమ్స్ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టడానికి బోర్డు పలు వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ప్రాధాన్యత రంగాలయిన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ మరియు అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సిస్టమ్స్ వంటి ప్రధాన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని బోర్డు నిర్ణయించిదన్నారు. తిరుపతి జిల్లాతో పాటు అనుబంధ జిల్లాల పారిశ్రామిక సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, ఆ ప్రాంతాల్లో కూడా స్టార్టప్‌లు, వ్యవస్థాపకతను ప్రోత్సహించాలని తెలిపారు. సమావేశంలో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, ఆదాని, నవయుగ, అమర రాజా కంపెనీల నుండి, ఐఐటి తిరుపతి బోర్డు సభ్యులు సీఈవో,, ఆర్టిఐ హెచ్‌లు పాల్గొన్నారు.

# కొత్త ఏడాదిలో.. కొత్త జిల్లాగా..మదనపల్లి

### మూడు నాలుగురోజుల్లో ప్రభుత్వంచే ఫైనల్ నోటిఫికేషన్ !! - జిల్లా మారనున్న పుంగనూరు.. గూడూరుపై ఉత్కంఠత !!

కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలను పునర్విభజన చేసే అంశం తుది దశకు చేరింది. రాష్ట్రంలో కొత్త జిల్లాగా మదనపల్లి ఏర్పాటు కానుంది. జిల్లా కేంద్రంగా మదనపల్లి పట్టణం మారనుంది. ఇందుకు సంబంధించి మరో మూడు నాలుగురోజుల్లోపై ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ వెలువరించే అవకాశాలు మెండుగా కన్పిస్తు న్నాయి.జిల్లాల పునర్విభజనకు సంబంధించి నవంబర్ 27న రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ వెలువరించిన విషయం విదితమే. ఈ నెలలోపు ప్రజలనుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇదివరకే జిల్లాల పునర్విభజనపై నియమించిన మంత్రుల సబ్‌కమిటీతో తుది చర్చలు పూర్తి చేశారని సమాచారం. దీంతో



మదనపల్లి జిల్లాను ప్రకటిస్తూ తుది నోటిఫికేషన్ వెలువడనుంది. ఈనెల 30లేదా 31న ప్రభుత్వం తుది నోటిఫికేషన్ వెలువరించనున్నట్లు సమాచారం.

**జిల్లా మారనున్న పుంగనూరు**

ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న పుంగనూరు నియోజకవర్గం మదనపల్లి జిల్లాలోకి మారనుంది. కాగా రెవెన్యూ డివిజన్లుగా మదనపల్లి, పీలేరు ఏర్పాటుకానున్నాయి. మదనపల్లి డివిజన్‌లో 11 మండలాలు, పీలేరుడివిజన్‌లో 8మండలాలు ఉ ంటాయి.పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లి మండలాలు మదనపల్లి రెవెన్యూడివిజన్‌కు, సదుం, సోమల మండలాలు పీలేరు డివిజన్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా కొత్త ఏడాదిలో కొత్త జిల్లాగా మదనపల్లి మారుతోంది. ఇప ్పటికే ఉన్నతాధికారులు పరిపాలనకు సంబంధించి భవనాలను ఎంపిక చేశారు.

## నెల్లూరు ప్రజానీకానికి గుడ్ న్యూస్..

**నెల్లూరులోనే గూడూరు నియోజకవర్గంతో పాటు**

**కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు**

**చంద్రబాబు నాయుడికి, ప్రభుత్వానికి ప్రజలు రుణపడి వుంటారు - గూడూరు ఎమ్మెల్యే పాశం**



గూడూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త

కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించడంతో పాటు గూడూరు నియోజకవర్గాన్ని కూడా కలపాలనే కూటమి ప్రభుత్వ ఆలోచనను స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం గూడూరు ప్రజలు, ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో పాటు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజలందరిలోనూ ఆనందం నింపే విషయం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేస్తున్న కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. మొదటి నుంచి ప్రజల నుంచి వస్తున్న వినతులను, వారి అభిప్రాయాన్ని కూటమి ప్రభుత్వం గౌరవించినట్లయిందన్నారు. 2024 ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు, యువనేత, మంత్రి నారా లోకేష్ బాబు జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేరేర్చినట్టయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అస్తవ్యస్త విభజనతో నెల్లూరు ప్రజలు శ్రీసిటీ, షార్, పులికాట్ సరస్సు, మేనకూరు సెజ్, వెంకటగిరి పోలేరమ్మ, సూళ్లూరుపేట చెంగాళమ్మ దేవస్థానాలను కోల్పోయారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతుండటంతో రామాయపట్నం పోర్టును కూడా కోల్పోతున్నామన్నారు. ఇలాంటి తరుణంలో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపడంతో పాటు మూడు మండలాలను ఇక్కడే కొనసాగించాలనే నిర్ణయం తీవ్ర టెన్షన్‌లో ఉన్న ప్రజానీకానికి బిగ్ రిలీఫ్ అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి జిల్లా ప్రజలందరూ రుణపడి వుంటారన్నారు. దీంతో గూడూరు నియోజకవర్గ ప్రజలు నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మూడురోజులు టోకెన్లుంటేనే...!

### ఆ వారం రోజులు అందరికీ దర్శనాలు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి ,ద్వాదశిపర్వదినాలతోబాటు జనవరి 1న టోకెన్ ఉంటేనే భక్తులకు టిటిడి దర్శనం కల్పిస్తుంది. మిగిలిన వారం రోజులు జనవరి 2నుండి 8వరకు ఆన్‌లైన్‌లో టిక్కెట్, టోకెన్లు పొందిన భక్తులతోబాటు సర్వదర్శనంలోనూ భక్తులను అనుమతినిస్తారు. డిసెంబర్ 30,31,.జనవరి 1న మాత్రమే టోకెన్లు ఉన్న వారికే వైకుంఠద్వార దర్శనం కల్పించేలా టిటిడి అధికారులు సిద్ధమవుతున్నారు. తిరుమల ఆలయంలో మోక్షమార్గం వైకుంఠద్వారం 30వతేదీ మంగళవారం వేకువజామున 1.30గంటలకు తెరచుకోనున్నాయి. ఆ తరువాత ఆలయంలో శుద్ధి,నిత్యకైంకర్యాలు జరిపించి కైంకర్యాలు ముగిసిన తరువాత ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు విశేష ఆభరణాల అలంకృతుల్ని చేస్తారు. తెల్లవారుజామున 4గంటలలోపే తొలుత ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు,ఆ తరువాత ప్రజాప్రతినిధులకువారి కుటుంబసభ్యుల వైకుంఠద్వార దర్శనం కల్పించి సామాన్యభక్తులను ఉదయం 5గంటలలోపే దర్శనాలకు అనుమతించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆ పదిరోజులు సిఫార్సులేఖలు కూడా స్వీకరించరు. అన్ని ఆర్జితసేవలు ,ప్రత్యేక దర్శనాలు రద్దుచేసిన విషయం విదితమే. ఇప్పటికే వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి జనవరి 2నుండి 8వరకు 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు 1.15లక్షలు భక్తులు పొందారు. శ్రీవాణి బ్రేక్ దర్శనాలు వారంరోజులు 7వేల టిక్కెట్లు భక్తులు పొందారు. స్థానికులకు జనవరి 6,7,8 తేదీలకు సంబంధించి మూడురోజులకు 15 వేల దర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తారు.30వతేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠ ద్వాదశి ఘడియలతో బాటు అదనంగా మరో ఎనిమిదిరోజులు పవిత్రమైన "వైకుంఠద్వారం"తెరచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆలయంలో ఏర్పాట్లు, పుష్పాలంకరణలుపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ ఎకె సింఘాల్, అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**-30న స్వర్ణరథం, 31న చక్రస్నానం:**

పవిత్రమైన దనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన తిరుమలలో ఈనెల 30వతేదీ ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు స్వర్ణరథం ఊరేగుతుంది. శ్రీదేవిభూదేవిసమేతంగా మలయప్ప స్వామి వారు విశేష అలంకరణలో స్వర్ణరధాన్ని అధిరోహించి ఆలయ మాఢవీదుల్లో ఊరేగనున్నారు. 31వతేదీ ద్వాదశిరోజు పవిత్ర పుష్కరిణిలో స్వామివారి చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవం జరిపిస్తారు.

## రెండోరోజు అలరించిన విజ్ఞాన సమ్మేళనం

తిరుపతి విద్య,డిసెంబర్ 27 ప్రభాత వార్త



జాతీయ సంస్కృత వర్సిటీలో శుక్రవారం నుంచి ప్రారంభమైన భారతీయ విజ్ఞాన సమ్మేళనం వీక్షకులను అలరిస్తోంది. ఇందులో భాగంగా రెండవ రోజు శనివారం 32 రాష్ట్రాలనుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1250 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ మ్యాజిక్ షో వీక్షకులను అలరించారు. ఈ సందర్భంగా రెండవ రోజు జరిగిన కార్యక్రమానికి ఐఐటీ ప్రొఫెసర్లు కాళిదాసు, విద్యాసాగర్, మోహన్ రాఘవన్, అలోక్ చతుర్వేది, హాజరై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అండ్ మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్, వికసిత్ భారత్ సాధనలో ఎలాంటి ప్రధాన భూమిక పోషిస్తాయో వివరించారు. అనంతరం డాక్టర్ జయంత్ వసంత్ జోషీ నిర్వహించిన సైన్స్ మ్యాజిక్ షో విద్యార్థులలో కొత్త ఆలోచనల్ని రేకెత్తించింది. విజ్ఞానశాస్త్రంలోని విశేషాలను ప్రాయోగికంగా వివరిస్తూ జరిగిన ఈ మ్యాజిక్ షో లోపలు ప్రాంతాలలోని విద్యాసంస్థల నుండి విచ్చేసిన విద్యార్థులు ఆసక్తితో పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి సభ్యురాలు డాక్టర్ శ్రామిక రవి విశిష్ట ప్రసంగంలో భారతదేశం యొక్క ఆర్థిక ప్రగతిని ప్రామాణికమైన గణాంకాలతో వివరించారు. రాష్ట్రవైద్య ఆరోగ్య, వైద్య విద్య కుటుంబ సంక్షేమ మంత్రి మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వైద్య వారసత్వానికి ప్రామాణికత చేకూర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సుశ్రుతుడు, చరకుడు వంటి మహర్షులు అందించిన వైద్యవిధానం చాలా గొప్పదని అన్నారు. మహర్షులు రంగరించి మేళవించి అందించిన వైద్య విధానంలో ఉన్న విశేషాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంత్రి సంప్రదాయవైద్యులు తెచ్చిన ఔషధ మొక్కల్ని , మూలికల్ని చాలా ఆసక్తితో వీక్షి ంచి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## నూతన సంవత్సరాదిన భక్తులందరికి సంతృప్తికర దర్శనం

### -జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కాణిపాకం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో 2026 నూతన సంవత్సరాదికి సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించే విధంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కాణిపాకం దేవస్థానంలో నూతన సంవత్సరాది ఏర్పాట్లపై స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ ఎస్పీ తుషార్ డూడి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లతో కలసి వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో నూతన సంవత్సరాది సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశమున్నట్లు తెలిపారు. ఆలయ దర్శనార్థం తరలివచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమ్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, కంట్రోల్ రూం ఏర్పాటు, పారిశుద్ధ్యం, మెడికల్ క్యాంప, విద్యుత్ సరఫరా, వంటి వాటి గురించి ఆయా శాఖలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అలాగే అత్యవసర పరిస్థితులను దృష్టిలో వుంచుకుని ఆంబులెన్స్‌లను, అగ్నిమాపక శకటాలను సిద్ధంగా వుంచుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ నూతన సంవత్సరాది రోజున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలాగే చిత్తూరు డీఎస్పీ ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ నూతన సంవత్సరాది సందర ్భంగా సుమారు 60 నుండి 70 వేల మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్ రాజు, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆలయ ఈఈ వెంకట నారాయణ, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, ధనుంజయ, ట్రస్ట్ బోర్డు సభ్యులు,డిఎంఅండ్ హెచ్ఓ సుధారాణి అడిషినల్ డీఎంఅండ్‌హెచ్ఓ వెంకట ప్రసాద్, డీఎస్పీ సాయినాథ్,స్థానిక ఎస్సై నరసింహులు పాటు వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోటెత్తిన భక్తజనం .. అధికారులు అప్రమత్తం

### తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, డిశంబర్ 27 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ ఏడాది చివరి శనివారం పోటెత్తిన భక్తజనంతో కిక్కిరిసిపోయింది. భక్తుల తాకిడి పెద్దఎత్తున పెరగడంతో ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్స్ వల్లంశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్ అప్రమత్తమై ఆలయంలో క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైళ్లలో దొంగతనాలు చేసే యువకుడు అరెస్టు..

### ..40 గ్రాముల బంగారు నగలు స్వాధీనం.



రేణిగుంట డిసెంబర్ 27 ప్రభాతవార్త..

.రేణిగుంట రైల్వే పోలీసులు చాకచక్యంగా వలపన్ని రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అజయ్ (27)ను అదుపులోకి తీసుకొని శనివారం రిమాండ్ కు పంపారు. గత కొంతకాలంగా అజయ్ అనే యువకుడు రేణిగుంట, తిరుపతి, చిత్తూరు రైల్వే స్టేషన్లో ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలను దొంగలించేవాడు. రైళ్లలో ప్రయాణిస్తున్న నిద్రిస్తున్న ప్రయాణికుల వద్ద నగలతో పాటు నగదు తస్కరించేవాడు. నిందితుని కోసం తిరుపతి రైల్వే డిఎస్పి హర్షిత ఆదేశాలతో రేణిగుంట రైల్వే సీఐ యతేంద్ర పర్యవేక్షణలో రైల్వే ఎస్సైలు మధుసూదన్ రావు, ధర్మేంద్ర రాజు తమ సిబ్బందితో నిందితుని కోసం వేట ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని పుత్తూరు రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్ఫారం చివరన అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సుమారు నాలుగు లక్షల రూపాయల విలువైన 40 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకొని దొంగ సొత్తుగా పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. ముద్దాయిపై వివిధ రైల్వే పోలీస్ స్టేషన్లలో బిఎన్ఎస్ సెక్షన్ కింద పలు కేసులు నమోదయి ఉన్నాయని శనివారం రేణిగుంట జి ఆర్ పి పోలీస్ స్టేషన్లో జరిగిన పాత్రికేయులు సమావేశంలో సీఐ యతేంద్ర తెలిపారు. కేసులు సేదించడంలో చెన్నై రైల్వే ఇంటలిజెన్స్ క్రైమ్ బ్రాంచ్ పోలీసుల సహకారం ఉందన్నారు. కేసు చేదించడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన జిఆర్ పి ఎస్సైలు మధుసూధన రావు, ధర్మేంద్ర రాజు, సిబ్బంది గురుమూర్తి, ఎలుమలై, అంజిబాబు. రేవంత్, లను తిరుపతి డిఎస్పి హర్షిత అభినందించారని తెలిపారు.

## టోకెన్లుతో ...సంయమనంతో రండి!

### సకల సౌకర్యాలు కల్పించాం: టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి



తిరుమల,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:

పదిరోజుల వైకుంఠవాకిలి దర్శనాలకు విచ్చేసే భక్తులకు విస్తృత ఏర్పాట్లుచేశామని టిటిడి అదనపుఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో తాగునీటి కొళాయిలు, నీళ్ళడ్రమ్ములు, అన్నప్రసాదం పంపిణీకి మొబైల్‌వ్యాన్లు సౌకర్యాలు కల్పించామన్నారు. వైకుంఠద్వార దర్శనాలకు తరలివచ్చే భక్తులకు కల్పించే సౌకర్యాలు, ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం అన్ని విభాగాల అధికారులతో కలసి శిలాతోరణం వద్దనుండి వైకుంఠమ్ 2 వరకు క్యూలైన్లను వెంకయ్యచౌదరి తనిఖీ చేశారు. సూచికబోర్డులను పరిశీలించారు.

## ప్రేమ పేరుతో మైనర్ బాలికపై అత్యాచారం

పాలసముద్రం, డిసెంబర్ 27 ప్రభాతవార్త..



మండలంలోని దీనబంధుపురం ఆది ఆంధ్ర వాడికి చెందిన దినేష్ 19 సంవత్సరాలు అదే గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి అత్యాచారం చేయడంతో అమ్మాయి కడుపు నొప్పి అని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆమె తల్లిదండ్రులు తీసుకొని వెళ్లగా పరిశీలించిన డాక్టర్లు ఆమె గర్భవతి అని తెలపడంతో ఒక్కసారిగా ఖంగుతిన్న తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక స్థానిక పోలీస్ స్టేషన్లో అతనిపై ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై వారి బృందంతో చాకచక్యంగా దీనబందపురం క్రాస్ వద్ద అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరి డిఎస్పి సయ్యద్ అహ్మద్, కార్వేటినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప స్థానిక ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో ఆలయం వద్ద ఏకాదశి ఏర్పాట్లు

తిరుపతిరూరల్,డిసెంబర్27 ప్రభాతవార్త:

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తుమ్మగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. ఆలయం లోపల వెలుపల ఏర్పాట్లు చురుగ్గా కొనసాగడంతో ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ పర్యవేక్షించారు. ఇప్పటికే గర్భాలయాన్ని శుద్ధి చేసిన అర్చకస్వాములు ఆలయంలో పరివార దేవతామూర్తుల ఆలయాలను పరిశుభ్రం చేశారు. అలాగే అలంకార మండపంలోని స్వామి వాహనాలను, ఆలయ పుష్కరిణిని సుగంధభరిత ద్రవ్యాలతో శుభ్రం చేసారు. ఆలయం ముందు ప్రత్యేంగా ఇనుప బ్యారికేడ్లతో క్యూలైన్‌లు, చలువ పందిళ్లు, రంగ వల్లికలతో తీర్చిదిద్ది వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ప్రధాన ఆలయంతో పాటు వైకుంఠ ద్వారం, ధ్వజస్తంభం పరివార దేవతామూర్తుల ఆలయాలకు జరిగే పుష్పాలంకరణకు దేశ, విదేశాల నుంచి పువ్వులను తీసుకువచ్చారు,

# మహిళా రైతులు.. సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం

### కనపర్తిలో మహిళా రైతుల చైతన్యం

తొట్టంబేడు,డిసెంబర్ 27 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలో పుష్కలంగా సాగునీటి వసతులున్నాయి. ఓ వైపు తెలుగుగంగ,మరో వైపు సువర్ణముఖి నది, మరో వైపు బోర్లు,బావులుండటంతో వ్యవసాయం ముమ్మరంగా సాగుతుంది.ఈ ఏడాది ముందస్తు వర్షాలు అన్నట్లు అక్టోబర్‌లోనే కురవటం చెరువులు నిండటం భూగర్భ జలాలు పెరగటంతో రైతులు పంట పొలాల్లో పనుల్లో బిజీగా ఉన్నారు.ఈ నేపధ్యంలో తొట్టంబేడు మండలంలోని పెద్ద గ్రామాల్లో ఒకటైన కనపర్తిలో మహిళా రైతులు సాగు చేస్తున్న వ్యవసాయానికి సంబంధించి ప్రభాతవార్త మహిళా రైతులు పద్మావతి, భ్రమరాంబలు సాగిస్తున్న వ్యవసాయానికి సంబంధించి అడిగి తెలుసుకున్నారు. వారికి ఉన్న భూముల్లో పంటలను పండించుటకు తాము స్వయంగా సేంద్రీయ ఎరువులను తయారు చేసుకుంటున్నట్లు వివరించారు.ఇంటివద్ద, పంట పొలాల వద్ద సేంద్రీయ ఎరువులను శాటిలైట్ ద్వారా తెలుసుకొని సాగిస్తున్నట్లు తెలిపారు. తాము తయారుచేసుకున్న ఎరువులు, మందులను ఆర్గానిక్ పంటలపై స్ప్రేచేస్తున్నట్లు వివరించారు.ఈ మహిళలు గ్రామంలోని ఇతర రైతులకు ఆదర్శంగా మార్గదర్శకంగా మారారని చెప్పవచ్చు.ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు



పంటపొలాలపై పిచికారి చేస్తున్న దృశ్యం

నాయుడులు సేంద్రీయ ఎరువుల ప్రాధాన్యతను వివరిస్తూ ఆ ఎరువులు వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారని వారి పిలుపు మేరకు తాము ఇంటి వద్దనే జీవామృతం, మన జీవామృతం,పంచదవ్య, వేప గింజల ద్రావణంలను తయారు చేసి వాటిని పంట పొలాలపై స్ప్రే చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా భూసారం పెరిగి భూమి సారవంతమైన ప్రకృతిలో సహజంగా లభ్యమయ్యే సేంద్రీయ నాణ్యతతోకూడుకున్న వ్యవసాయం



పంట పొలాల వద్ద సేంద్రీయ ఎరువులను తయారు చేసుకుంటున్న మహిళా రైతులు

చెయవచ్చునని వివరించారు.

**కేంద్ర సర్టిఫికేట్:**

తాము పండించే పంటలకు కేంద్ర ప్రభుత్వం ఆర్గానిక్ సర్టిఫికేట్ మంజూరు చేయటం ద్వారా తాము పండించే సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరకు అమ్ముకునే విధంగా కేంద్ర ప్రభుత్వం తమకు అవకాశం కల్పిస్తుందని మహిళా రైతులు వివరించారు. పిఎం కిసాన్ నిధులతో తాముఈ జీవామృతంను తయారుచేసుకుంటున్నామని ప్రకృతి వ్యవసాయాన్ని సాధిస్తున్నట్లు వివరించారు.

## ప్రజలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

తవణంపల్లె, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



వ్యాపారస్తులు ఎవరైనా వాహనాలను రోడ్డుకు అడ్డంగా వుంచి వాహన చోదకులకు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై డాక్టర్ నాయక్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రం తవణంపల్లెలో ఎస్సై సిబ్బందితో కలసి కవాతు నిర్వహించారు. ఈసందర భంగా తోపుడు బండ్ల వ్యాపారస్థులు తమ వాహనాల రోడ్డుకు అడ్డంగా వుంచి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే రోడ్డులో సైన్ బోర్డులు పెట్టకుడదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు నిరవహించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెఎం ఫౌండేషన్ తరపున మేల్మరువత్తూరుకు ఉచిత బస్సులు

చిత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:



చిత్తూరునియోజకవర్గంలోని ఓంశక్తి భక్తుల కోరిక మేల్మరువత్తూరుకు వెళ్లడానికి జిజెఎం ఫౌండేషన్ తరపున ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఉచిత బస్సులను ఏర్పాటుచేసి తన ఉదారతను చాటుకొన్నారు. శనివారం రాత్రి 46వవార్డు పంట్రాంపల్లి, 41వవార్డు తోటపాళ్యం, గుడిపాల మండలం (కోటూరు, కోలావూరు)పంచాయతీలు, పాపిశెట్టిపల్లి మారుమూల ప్రాంతాలనుంచి ఐదు ప్రత్యేక బస్సులో 400మంది భక్తులు బయలుదేరగా స్థానిక నాయకులు జెండాఊపి సాగనంపారు. ఈ సందర్భంగా వరుసగా మూడవ ఏడాది సొంతఖర్చులతో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఉచిత బస్సులు ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే జగన్‌మోహన్, ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులుకు ఓంశక్తి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతో జీవన ప్రమాణాలో మార్పు

– ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



**కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త** ప్రకృతి వ్యవసాయ పంటలతో ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకురావచ్చని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో రైతు సాధికార సంస్థఅధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలోనే సిక్కిం రాష్ట్రం వంద శాతం ప్రకృతి వ్యవసాయ రాష్ట్రంగా మారిందన్నారు. కుప్పంలో సైతం సిఎం చంద్రబాబునాయుడు ప్రకృతి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేలా చర్యలుచేపట్టారన్నారు. పంటలసాగులో రసాయనాల వాడకం తగ్గిస్తే ఆరోగ్యం సైతం బాగుంటుందన్నారు. వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మనిషి ఆయు:ప్రమాణాలు సైతం తగ్గుతున్నాయన్నారు. ప్రకృతి సిద్ధమైన కషాయాలతో పంటలసాగు రైతులకు ఎంతో లాభమన్నారు. కుప్పంలో ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో ఉన్న ప్రకృతిసాగు సేద్యాన్ని విస్తృతం చేసేలా అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నోడల్ అధికారి బాజిబాబు, నియోజకవర్గ అధికారిఅమృతవల్లి,ఉద్యానవనశాఖఎడిపల్లవి, కడ సభ్యుడు వెంకటేష్, ఎపిఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్ని నైపుణ్యవంతులుగా మలచడమే లక్ష్యం

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డా॥ బిసి నాగరాజ్

– ఘనంగా కెఇసి వ్యవస్థాపక దినోత్సవం.. ఉద్యోగులకు 23.9కోట్ల భీమా సౌకర్యం !!



**కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త** విద్యార్థుల్ని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడమే తమ విద్యాసంస్థల లక్ష్యమని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్, బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డా॥ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ జన్మదినం సందర్భంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం లాంటి వెనుకబడిన ప్రాంతంలో విద్యార్థులను సా ంకేతికవిద్యలో తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రముఖ కార్పోరేట్ సంస్థలు, ప్రభుత్వ శాఖల్లో పనిచేయడంతో పాటు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇది తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఈసందర్భంగా తమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 478మంది సిబ్బందికి ప్రతి ఒక్కరికి ఐదు లక్షల వంతున 23.9కోట్ల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మండలంలోని మోట్లచేను జడ్పీహైస్కూల్‌లో బిసిఎన్ ఛారిటబుల్ ట్రస్ట్‌చే 3లక్షలతో నిర్మించిన కళావేదిక, సరస్వతి విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం బధిర పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం జరిపారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా॥ లోకేష్,హెచ్ఒడి రవీంద్రకుమార్, మాధవన్,డా॥ శరవణ, గంగాధకర్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్,డా॥ వీణ, డా॥ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## హాకింగ్స్ విద్యార్థులచే సైకిల్ ర్యాలీ

కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త



పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేలా స్థానిక హాకింగ్స్ స్కూల్ విద్యార్థులు ఛైర్మన్ ఎస్‌డి హఫీజ్ నేతృత్వంలో శనివారం కుప్పంలో పెద్ద ఎత్తున సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం పాశ్చాత్య పోకడలకు అలవాటుపడి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. ఆరోగ్యవంతులే ప్రపంచ ంలో నిజమైన ధనవంతులని నిత్యం వ్యాయామంతో పాటు సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని విశ్యార్థులకు సూచించారు. సైకిల్ వాడకంతో ఇంధన వినియోగం సైతం తగ్గుతుందని తద్వారా పర్యావరణం సైతం పచ్చగా ఉంటుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం షబ్బీర్, డైరెక్టర్లు రఫీక్, డా॥ సురేష్‌మునిరత్నం, వైస్ హెచ్ఎం అరుణాసింగ్ చౌహాన్, కోఆర్డినేటర్ నదియా, గౌతమన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పరిమళించిన మానవత్వం

– అనాథ శవానికి మాజీ సర్పంచ్‌చే అంత్యక్రియలు

కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త

డికెపల్లి మాజీ సర్పంచ్ డికెపల్లి మణి (డివి సుబ్రమణ్యం) మరోమారు తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల గుడుపల్లె రైల్వేస్టేషన్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన విషయంవిదితమే. అతని బంధువులు ఎవరూ రాకపోవడంతో రైల్వే పోలీసులు మాజీ సర్పంచ్ డికెపల్లి మణికి విషయం తెలిపారు. దీంతో స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో అనాథ శవానికి సంప్రదాయ రీతిలో అంత్యక్రియలు జరిపించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసు సిబ్బంది శివశంకర్, రమేష్, మాదేష్, శివ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చొరవ

శాంతిపురం, డిసెంబర్ 27 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చొరవ చూపుతోందని ప్రభుత్వవిప్, కడపిఎసి ఛైర్మన్‌డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బందతిప్పనపల్లి గ్రామంలో పల్లెపండగ 2.0కార్యక్రమంలో భాగంగా నూతన సిసి రోడ్డు నిర్మాణంకుడా॥ శ్రీకాంత్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సిఎం ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో ప్రజల అవసరార్థం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడం జరుగుతోందన్నారు. అవసరమైనచోట్ల డ్రైన్లు, సిసి, బిటి రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇటీవలే కడద్వారా గ్రామాలకు 8వేల ఎల్ఇడి సెన్సర్ లైట్లు అందించామన్నారు. కార్యక్రమంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు, నేతలుమణి,బసవరాజు,నారాయణ,రాజేంద్ర,జయరాజ్,కలీమ్,మురళి, సర్పంచ్ బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడికట్ల పూజలు

సదుం డిసెంబర్ 27 ప్రభాతవార్త



మండల పరిధిలోని ఎర్రతివారిపల్లె లో బురుజు కొండపై వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం పడిమెట్ల పూజలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 18 మెట్లను వివిధ రకాల పూలు పండ్లు తదితరాలతో అలంకరించారు. అనంతరం అర్చకులు నంబుద్రి నారాయణ ఆధ్వర్యంలో ఒక్కొక్క మెట్టుకు పూజ చేస్తూ 18 పడిమెట్లకు పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప స్వాములు భజనలతో అలరించారు. పుంగనూరు శాసనసభ్యులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన సతి మణి స్వర్ణలత,తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, ఆయన సతీమణి కవితమ్మ,జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి,మాజీ జడ్పిటిసి రేణుక, రమేష్ రెడ్డి, మనోహర్ రెడ్డి,పులిచెర్ల మండల వైసీపీ నాయకులు నాదముని రెడ్డి, గోవింద్ రెడ్డి, చౌడేపల్లి జెడ్పీటీసీ రాజు, మండల పరిధిలో నీ సర్పంచ్లు, ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు దిడ్డివారిపల్లి గ్రామస్తుల వితరణ

సోమల, డిసెంబర్ 27 ప్రభాతవార్త



వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులకు సోమల పంచాయతీ దిడ్డివారిపల్లి కు చెందిన ప్రజలు వితరణ చేశారు. కర్ణాటక నుంచి వేలాదిమంది భక్తులు కాలినడకన సోమల మీదుగా తిరుమల వెళ్లడం పరిపాటి. ఈ క్రమంలో దిడ్డివారిపల్లి ప్రజలు ప్రతి సంవత్సరం ఉదయం 4 గంటల నుంచి ఏడు గంటల వరకు భక్తులకు కాఫీ టీ బిస్కెట్లు వితరణ చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో శనివారం ఉదయం 5000 మంది భక్తులకు కాఫీ టీ బిస్కెట్లు అందజేసినట్లు కార్య నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దిడ్డివారిపల్లి గ్రామస్తులు రమణ, రామ్మోహన, రత్నయ్య, సుబ్రహ్మణ్యం, లలిత, గిరిజ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా శ్రీవిరుపాక్షమ్మ ఆలయం 14వ వార్షికోత్సవం

కల్లూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం దేవళంపేటలో శ్రీ విరుపాక్షమ్మ ఆలయం 14వ వార్షికోత్సవ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శ్రీ నాగదేవతల మొదటి సంవత్సరం వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారికి. హోమాలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. నాగదేవతలకు విశేష పూజలు జరిపారు అమ్మవారి భక్తి గీతాలు ఆలపించారు. ఆలయ ధర్మకర్తలు, గురు స్వామి అరుణ దంపతులు మల్లికార్జున, హరిత దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు వార్షికోత్సవ మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని నాగదేవతలను దర్శించుకున్నారు.

## అపోలో యూనివర్సిటీలో గణిత దినోత్సవం

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:

చిత్తూరు ది అపోలో యూనివర్సిటీ క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు మాట్లాడుతూ గణితం శాస్త్ర, సాంకేతిక రంగాలకు పునాదిగా నిలుస్తోందన్నారు. కష్టాల మధ్యన కూడా గణితంపై అచంచలమైన నమ్మకంతో రాణించిన రామానుజన్ జీవితం విద్యార్థులకు ఆదర్శమన్నారు. గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.నాగేశ్వరరావు రామానుజన్ చేసిన పరిశోధనలు, సంఖ్యలపై ఆయన కృషిని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణిత క్విజ్ పోటీలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవంను చిత్తూరులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ సమన్వయకర్త పోటుగారి భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, సుదీర్ఘకాలంగా దేశం, రాష్ట్రంను పాలించి అన్ని రంగాల్లో దేశ, రాష్ట్రాలను అభివృద్ధి చేసిన ఘనత వుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజల వద్దకు పోలీసులు

– చర్చివీధిలో ట్రాఫిక్, మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యల ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు చర్చివీధిల్లోకి పోలీసులు నడచి వెళ్తున్న వారికి, షాపు యాజమానులకు ట్రాఫిక్ నిబంధనలు, మత్తు పదర్థాల ద్వారా కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యలు షాపు యాజమానులతో మాట్లా డుతూ ప్రతి ఒక్కరు సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## చేతి వృత్తుల వారికి విశ్వకర్మ యోజన ఒక వరం

– సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా

చిత్తూరుహెల్త్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



చేతి వృత్తుల వారికి విశ్వకర్మ యోజన ప్రధాని మోడి కల్పించిన ఒక వరం లాంటిదని జిల్లా సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. బిజెపి కార్యాలయంలో శనివారం విశ్వకర్మ యోజన పథకంపై సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సీనియర్ బిజెపి నాయకులు, విశ్వకర్మ యోజన జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులు చిట్టిబాబు కొల్లాతో పాటు పథక పరిశీలకులు కుమారి, నాగరత్నలు హాజరై లబ్దిదారులతో మాట మంతి నిర్వహించి పథకం అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిట్టిబాబు కొల్లా మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకం రెండేళ్ల క్రితం ప్రారంభమైందని, ఈ పథకం కింద లబ్దిదారులుగా ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చి రోజుకు రూ.500 స్టైఫండ్ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం రూ.15 వేల విలువైన టూల్ కిట్ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా ఒకొక్క లబ్దిదారుడికి రూ.2 లక్షల రుణం మంజూరు చేయడం జరిగిందన్నారు. చిట్టిబాబుకొల్లా మాట్లాడుతూ లబ్దిదారులతో సర్వే నిర్వహించి పథకం అమలు జరిగిన తీరుపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ యోజన పథక లబ్దిదారులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరుకు చెందిన హేమస్వ రూప్ అనే భక్తుడు ఈపథకానికి 1,00, 232 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, సీఎఫ్ఓ నాగేశ్వరరావులకు అందజేశారు.

## జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షులకు ఘన సన్మానం

చిత్తూరు రూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



జిల్లా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసి యేషన్ (జిల్లా ఎన్జీఓ) అధ్యక్షుడిగా నాలుగవ సారి ఎన్నికైన జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె.వి. రాఘవులును శనివారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఘనంగా సత్కరించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం చిత్తూరు డివిజన్ వారి ఆధ్వర్యంలో మాజీ సైనికులు కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు సురేంద్ర, ఎస్.మురళీ, పళని, శ్రీనివాసన్, భారతి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

కుప్పం,డిసెంబర్ 27 ప్రభాతవార్త

మండలంలోని నూలుకుంట గ్రామంలో ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన కాళీ (35) అనే యువకుడు ఓ మహిళతో కొన్నాళ్లు సహజీవనం చేశాడని అయితే ఆమె ఏడాది క్రితం వెళ్లిపోయిందన్నారు. అప్పటినుంచి ఇంట్లో ఉంటున్న కాళీ మనస్తాపంకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## సంక్షేమం కోసం రాజీపడని ధోరణి

### -టీటీడీ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్. కార్యదర్శి గా రామచంద్ర

తిరుపతి,డిసెంబర్ 27ప్రభాతవార్త:



విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి రాజీపడని ధోరణితో సేవలందిస్తానని టీటీడీ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్. కార్యదర్శిగా ఎన్నికైన వి.రామచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు విశ్రాంత ఉద్యోగులు, టిటిడి ఉద్యోగులు పలువురు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.టీటీడీ పెన్షనర్ల సంక్షేమం కోసం మీ సేవాభావం, విశ్వాసానికి చక్కని ప్రతిఫలంగా ఈ ఎన్నిక నిలిచిందని భావిస్తున్నామన్నారు. మీ నాయకత్వంలో అసోసియేషన్ మరింత బలోపేతమై, పెన్షనర్లకు మరింత విశ్వాసం, సౌకర్యం కల్పించే కార్యక్రమాలు అమలులోకి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.కొత్త బాధ్యతలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం తో ఆరోగ్యము, ఆయురారోగ్యాలు, విజయం సాఫల్యం చేకూరాలని కోరుకుంటున్నామన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పట్టణానికి రూ.39.39 కోట్ల బడ్జెట్ !! ఛైర్మన్ అలీమ్ భాష

పుంగనూరు డిసెంబర్ 27 ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రాంతాలను 2026-27 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి చేసేందుకు రూ.39,39 కోట్లతో బడ్జెట్‌ను మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాషా శనివారం ప్రవేశపెట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో ఈ బడ్జెట్‌ను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్ సమావేశం అనంతరం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించి పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అలీమ్ బాషా మాట్లాడుతూ, పుంగనూరు పురపాలక పరిధిలోని నక్కబండ ప్రాంతంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రూ.5 లక్షల వ్యయం తో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని, పనులు త్వరగా పూర్తి చేయిస్తామని చెప్పారు. అలాగే మురుగునీరు రోడ్లపైకి రాకుండా నివారించేందుకు రూ.12 లక్షలతో కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ లో నాగేంద్ర లలితమ్మ కౌన్సిలర్లు అమ్ము కాళీ మమత తదితర మున్సిపాలిటీ సిబ్బంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఎర్ర జెండా

చిత్తూరుహెల్త్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



పేదలకు అండగా కమ్యునిస్టు పార్టీ, ఎర్రజెండా నిత్యం అండగా నిలుస్తుందని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. సిపిఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో శనివారం పాత ప్రశాంత్‌నగర్‌లో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ 1992 సంవత్సరంలో భూ పోరాటం చేసి గూడు లేని నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయించిన ఘనత సిపిఐ పార్టీదన్నారు. 1992 సంవత్సరంలో ఏర్పాటైన ప్రశాంత్‌నగర్ కాలనీ ఏర్పాటైతే ప్రస్తుతం ఆ పేరును చంద్రబాబునాయుడు కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ అంటూ పిలుసున్నారన్నారు. వేలాది మంది జీవనం సాగిస్తున్న పాత ప్రశాంత్‌నగర్‌లో కనీస మౌళిక సదుపాయాలైన రోడ్లు, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాలనీలో ఎలాంటి అసాంఘీక కార్యక్రమాలు జరుగకుండా వుండటానికి ఇక్కడ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ లేదా ఔట్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, నాయకులు పి.రఘు, గజేంద్రబాబు, జయలక్ష్మీ, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

పుంగనూరు రూరల్ డిసెంబర్ 27 ప్రభాత వార్త



రూరల్,వైకుంఠ ఏకాదశి పవిత్రపుణ్య దినం కోసం శ్రీ కళ్యాణ వేంకటరమణ స్వామి వారి ఆలయం ముస్తాబవుతోంది.పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు శ్రీవారి దర్శనా నికి రానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి పర్యవేక్షి స్తున్నారు. భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా క్యూలైన్లు, భద్రత, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వేకువజాము 4 గంటలకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ దర్శనం చేసుకోవాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నేత్రారోగ్యం ప్రదానం

పుంగనూరు రూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త



పట్టణంలోని తాటిమాకులపాళ్యం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పట్టణంతో పాటు సమీప గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శంకర్ నేత్రాలయ ఆసు పత్రికి చెందిన డాక్టర్ మురళీకృష్ణ సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలి, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల అధిక వినియోగం వల్ల కంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తరచూ కంటి పరీక్షలు,శుభ్రత, సరైన ఆహారం అవసరమన్నారు. అలాగే చిన్నపిల్లలు, వృద్ధులు ప్రత్యేకంగా కంటి సంరక్షణపై శ్రద్ధ చూపాలని సూచించారు.

## ప్రజలకు చేరువయ్యేందుకే ఫుట్ పెట్రోలింగ్ : సిఐ

చౌడేపల్లి, డిసెంబర్ 27 ప్రభాతవార్త



ప్రజలకు చేరువయ్యేందుకే పోలీసు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు పుంగనూరు రూరల్(చౌడేపల్లి)సిఐ రాంభూపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని బజారు, బస్టాండు, పలమనేరు బస్‌స్టేషన్ వరకు పోలీస్ ఫుట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. పాఠశాలలు విడిచిపెట్టిన సమయంలో విద్యార్థి ణులకు భరోసా ఇస్తున్నామన్నారు. అదే విధంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా చర్యలు తీసుకొంటు న్నట్లు వివరించారు. స్థానిక బస్టాండులో దుకాణదారులు మట్టిని రోడ్డుపైకి వేయడం వల్ల వాహనదా రులు, ప్రయాణీకులకు ఇబ్బందిగా వుందని సిఐ దృష్టికి తీసుకురాగా పంచాయతీ అధికారులు, దుకాణదారులతో సమావేశమై బస్టాండులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండును నిశితంగా తనిఖీ చేసారు.

## హిందూ సమ్మేళనానికి తరలిరండి

చౌడేపల్లి, డిసెంబర్ 27 ప్రభాతవార్త



హిందూ సమ్మేళనానికి అందరూ తరలి రావాలని హిందూ సమ్మేళన నిర్వాహణా కమిటీ ఆహ్వానించింది. ఈమేరకు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కరపత్రాలను విడుదల చేసారు. మండల కేంద్రమైన చౌడేపల్లిలో ఈనెల 28న హిందూ సమ్మేళనం వుంటుందన్నారు. స్థానిక కళ్యాణ గంగమ్మ ఆలయం సముదాయంలోని మైదానంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి హిందువులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## 30న గడ్డంవారిపల్లిలో భూముల రీసర్వే

చౌడేపల్లి, డిసెంబర్ 27 ప్రభాతవార్త

మండలంలోని గడ్డంవారిపల్లిలో ఈనెల 30నుంచి భూముల రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పార్వతి అన్నారు. ఈమేరకు తెల్లనీళ్ళ పల్లిలో తేదేపా మండలాధ్యక్షుడు గువ్వర రమేష రెడ్డి(చిట్టి)ని రెవిన్యూ అధికారులతో వెళ్ళి ఆహ్వానించారు. గడ్డంవారిపల్లిలో ర్యాలీ, రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. భూముల రీసర్వేలో భాగంగా వచ్చే అధికారులకు రైతులు రికార్డులతో సహకరించా లన్నారు. అనంతరం గువ్వల రమేష్‌రెడ్డిని సత్కరించారు. సర్వేయర్లు మురళీకృష్ణ, విఆర్వో జీవనజ్యోతి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో భూముల రీసర్వేపై సదస్సులు

– ఉప తహశీల్దార్ అశోక్

బైరెడ్డిపల్లి, డిసెంబర్ 27 ప్రభాతవార్త



ప్రభుత్వం ఆదేశాల మేరకు జనవరి 2నుంచి మండలంలో భూముల రీసర్వే చేపడుతున్నట్లు ఉప తహశీల్దార్ అశోక్ తెలిపారు. మండలంలోని ధర్మపురి, కమ్మనపల్లి, లక్కనపల్లి, గంగినాయనపల్లి, పెద్దచెల్లారకుంట, దేవదొడ్డి గ్రామాల్లో శనివారం రీసర్వేపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. భూములను రీసర్వే చేసి పటిష్టంగా రైతులకు భూరికార్డులు అందించడం జరుగుతుందన్నారు. రైతులు ఎలాంటి అపోహలు చెందరాదని కోరారు. రైతులు పొలాల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని కోరారు. ఆర్ఐ దామోదరాచారి, విఆర్వో శంకర్, సర్వేయర్ ప్రసాద్,చరణ్,లోకేష్, హరీష్ పాల్గొన్నారు.

## పచ్చటి చెట్లు నాటాలనే ప్రేరణే లక్ష్యంగా.. ప్రపంచ యాత్ర

కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త

ప్రకృతి తల్లిని పరిరక్షించాలనే ఆశయంగా పచ్చటి చెట్లను నాటాలని ప్రజలకు ప్రేరణ కల్పించడమే లక్ష్యంగా తమిళనాడుకుచెందిన ఓయువకుడు ఇండియన్.. నో స్టేట్..నోక్యాస్ట్ అనే నినాదంతో సైకిల్‌పై దేశ, విదేశాలు తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. శనివారం ఈ యువకుడుకుప్పం చేరుకోగా 'ప్రభాతవార్త' అతనితో మాట్లాడడం జరిగింది. కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వాన్ అనే యువకుడు 11లక్షల చెట్లను నాటించాలనే లక్ష్యంతో 2021లో సైకిల్‌పై తన ప్రపంచదేశాల యాత్రకు శ్రీకారం చుట్టాడు. కన్యాకుమారి నుంచి లడఖ్ దాకా సైకిల్ యాత్ర చేపట్టిన సెల్వాన్ అనంతరం అక్కడనుంచి నేపాల్,బంగ్లాదేశ్‌లో పర్యటించాడు. ప్రస్తుతం యాత్ర కొనసాగిస్తూ సైకిల్‌పైనే మయన్మార్, బ్యాంకాక్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాలను చుట్టేసి వస్తానని తెలిపాడు. 2028నాటికి తన ప్రపంచ యాత్ర పూర్తి చేస్తానని ఆత్మవిశ్వాసంతో చెప్పాడు. ఇప్పటిదాకా 8.40లక్షల మొక్కలు తన సైకిల్ పర్యటనతో నాటించినట్లు అతను పేర్కొన్నాడు.

## చిత్తూర పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిని సత్కరించిన నేతలు



విజయపురం, డిసెంబరు 27 ప్రభాతవార్త: చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డిని పుత్తూరులో శనివారం మాజీ జడ్పీటీసీ గజేంద్రనాయుడు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మహేంద్ర శాలువలతోసత్కరించారు. సామాన్య టీడీపీ కార్యకర్తలను సైతం గుర్తించి వారికి పదవులు ఇచ్చి గౌరవించే కీర్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కళియంబాకం సాగునీటి సంఘ అధ్యక్షుడు గాలి రమేష్, టీడీపీ నాయకుడు గాలి మురళీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ



**విజయపురం, డిసెంబరు 27 ప్రభాతవార్త:** ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మండలంలోని జగన్నాథపురంలో శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వాసు మాట్లాడుతూ పీఎం రాష్ట్రీయ వికాసయోజన పథకం ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సూచనలు ఇచ్చారు. గణ జీవామృతం తయారీ, వినియోగం గురించి అవగాహన కల్పించారు. నింద్ర మండలం అత్తూరులో ఎస్టీలకు ఏవో మాధవి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఏవో రజనీకుమారి, ఏఈవో తులసిరాం, మీన, చంద్రశేఖర్, ప్రతాప్, ఇన్‌చార్జిలు సంపత్, ఆశ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాల్లో చోరీలకు విఫలయత్నం

గస్తీ పెంచాలంటున్న జనం

**పుత్తూరు రూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** దురలవాట్లు, వ్యసనాలు, త్వరగా డబ్బులు సంపాదించాలనే వ్యామోహంతో యువత చోరీలకు పాల్పడుతున్నారు. ఎలాగోలా దుకాణాల షట్టర్లు పగులగొట్టి డబ్బులు, విలువైన వస్తువులు తీసుకెళ్లే ప్రయత్నాలు చేపడుతున్నారు. ఇలా పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో శనివారం వేకువ జామున సుమారు 2.30 గంటల ప్రాంతంలో దొంగలు దుకాణంలోచోరీకి విశ్వ ప్రయత్నం చేశాడు. ఎలక్ట్రికల్ షాపును లక్ష్యంగా చేసుకున్న వారు ప్రణాళిక ప్రకారం సీసీ కెమెరాలను పూర్తిగా ధ్వంసం చేసి అనంతరం షట్టర్ లాకులను పగులగొట్టేందుకు యత్నించారు. అయితే ప్రత్యక్షంగా వేసిన ప్రధాన లాక్ తెరుచుకోకపోవడంతో వారి ప్రయత్నం విఫలమైంది. అదే రోడ్డులోని మరో నాలుగు దుకాణాల వద్ద ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. ప్రత్యేక లాకులు చోరీలను అడ్డుకుంది. ఈ ఘటనతో పట్టణంలోని వ్యాపారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో పుత్తూరులో ఇలాంటి చోరీలు, చోరీయత్నాలు తరచుగా జరుగుతున్నప్పటికీ, నివారణ చర్యలుఆశించినస్థాయిలోలేవన్నవిమర్శలువినిపిస్తున్నాయి.గస్తీవిధానాన్నిపునఃసమీక్షించాలనికోరుతున్నారు.

## తాగి వాహనం నడిపిన ఆరుగురు అరెస్టు: రూ.60వేలు జరిమానా

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నగరంలో చిత్తుగా మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురిని అదుపులో తీసుకొని రూ.60వేలు జరిమాన విధించినట్లు అర్బన్‌సిఐ ప్రకాష్‌కుమార్ శనివారం వివరించారు. తిరుపతి ఎస్‌పి ఆదేశాలతో శ్రీకాళహస్తి పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కఠినంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాల నడుపుతూ ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.శృతి మించి మద్యం సేవించిన ఆరుగురిని అరెస్టు చేసి శ్రీకాళహస్తిలోని మొదటి తరగతి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఎదురుగా హాజరు పరచినట్లు సిఐ ప్రకాష్‌కుమార్ వివరించారు. చట్ట పరిధిలో ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమాన విధించినట్లు తెలిపారు.రోడ్డుభద్రత కోసం పోలీసుల విజ్ఞప్తిని పాటించాలని ఆయన వాహన చోదకులకు సూచించారు.

## ఆల్ ఇండియాలాయర్స్ అసోసియేషన్ సభ్యునిగా అంకయ్య

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్‌లో శ్రీకాళహస్తి కి చెందిన న్యాయవాదికి స్థానం లభించింది. ఇక్కడ న్యాయవాదిగా ఉంటున్న కెసి అంకయ్యకు అవకాశం లభించింది. ఆల్‌ఇండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసమావేశం శనివారం జరిగి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ యూనియన్ కార్యక్రమాలు నిర్వహించకపోవటంతో ఈ నెల 8వ తేది జిల్లా కమిటిని రద్దు చేసినట్లు తెలిపారు. దీని స్థానంలో తిరుపతి నుంచి పత్తికొండ మురళి,హేమచంద్రారెడ్డి,చల్లావెంకటయ్య,భానుసుందర్, చిత్తూరు నుంచి గుణశేఖర్‌రెడ్డి మదనపల్లి నుంచి షాజహాన్‌బాషా, పివీ ప్రసాద్, సోమశేఖర్,శ్రీకాళహస్తి నుంచి కాకి చిన్న అంకయ్యలతో కూడిన 9 మంది సభ్యులతో కమిటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు ప్రకటించారు. కొత్త కమిటి ఏర్పడే వరకు వీరు కొనసాగుతారని తెలిపారు.

## కన్నుల పండువగా గంధోత్సవం: దేశం నాయకుల దర్శనం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని పవిత్ర జీవనది సువర్ణముఖి తీరాన వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న జంలేపీర్‌షా వలి అల్లాహ్ వారి దర్గాలు జరుగుతున్న గంధోత్సవంలో తెలుగుదేశం నాయకులు హాజరై మొక్కులు మొక్కుకున్నారు. వారికి దర్గా సంప్రదాయం మేరకు ముజావర్లు సయ్యద్ అహమ్మద్,జహంగీర్, బాబాలు వారికి స్వాగతం పలికారు. వలీఅల్లాహ్ ఉదంతాలను వివరించారు.ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు సారధ్యంలో వలీ అల్లాహ్‌కు నైవేద్యంగా మిఠాయిలు, వలీ అల్లాహ్ సమాధిపై చాదర్‌ను సమర్పించారు.ఈ మేరకు తెలుగుదేశం పార్టీకి చెందిన రాష్ట్ర మైనారిటి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ అలి, మార్కెటింగ్ కమిటి డైరెక్టర్ షఫీ, గాదిపాకుల గోపి,,పోలూరు శ్రీనివాసులురెడ్డి, ఐటిడిపి ఖాదర్, మీర్జా, సిఎస్ మస్తాన్, జహీర్, నయిం, రఫీ,సాజిద్, జాకీర్, షాహాబుద్దీన్, హర్షద్,దొరబాబు, బుజ్జి, ఆర్ముగం,రూకేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే దేశభక్తిని అలవరచుకోవాలి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



విద్యార్థి దశలోనే ప్రతి ఒక యువకుడు దేశ భక్తిని అలవరుచుకోవాలని తిరుపతిజిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప అన్నారు. ఇక్కడి విద్యాజ్యోతి పబ్లిక్ పాఠశాలలో వీరబాల దివస్‌ను నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్రమోదీ సారధ్యంలో 2022లో ఈ కార్యక్రమాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటీఫికేషన్ జారి చేసిందని వివరించారు. భరత మాత స్వేచ్ఛ సంస్కృతి రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు.అలాంటి వారిలో బాబాజోరవర్‌సింగ్, బాబాఫతేసింగ్‌లు ఉన్నారన్నారు.వీరు పదవ సిక్కు గురువు గురుగోవింద్ జీ చిన్న కుమారులు అన్నారు.అలాంటి వారి త్యాగనిరతిని స్మరించుకుంటూ వీర బాల దివస్‌ను నిర్వహించుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర నాయకురాలు కండ్రిగ ఉమ పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## కూలీలు శాతం పెంచాలి: ఏపీడి సరిత

తొట్టంబేడు డిసెంబర్ 27 ప్రభాతవార్త



ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరూ బాధ్యులై ఉండాలని,వందరోజుల పని దినాలను ఉపయోగించుకోవాలని శ్రీకాళహస్తి ఏపీ డి సరిత శనివారం అన్నారు. ఈ మేరకు ఆమె తొట్టంబేడు మండలంలోని బసవయ్య పాలెం పంచాయితీ జ్ఞానమ్మ కండ్రికలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ గ్రామంలో కూలీల శాతం పెంచాలి. ప్రతి ఒక్కరికి ఒక రోజుకురూ 307 రూపాయలు వేతనం వస్తుందని సంవత్సరానికిరూ. 30వేల 700 రూపాయలు మీ ఖాతాలో జమవుతుంది. ప్రతి ఒక్కరూ సంవత్సరంలో 365 రోజుల్లోగా ఈ పని దినాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కళ్యాణి, టి ఏ లు లత, ముని బాబు, మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధి కొత్త చట్టంపై గ్రామసభలు..!

తొట్టంబేడు డిసెంబర్ 27 ప్రభాతవార్త

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన వికసిత భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీ వికా మిషన్పై 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామస భలు నిర్వహించనున్నారు. చట్టంలోని కీలక నిబంధనలు, చట్టబద్ధ హక్కు లపై శ్రామికులు, ప్రజలకు గ్రామసభల్లో అవగాహన కల్పించడంతో పాటు చర్చించనున్నారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశించింది.

## మహిళపై యువకుడు దాడి

**వడమాలపేట, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మండలంలోని వేమాపురంలో వెంకటరత్నమ్మ(50)పై అదే గ్రామానికిచెందిన కిషోర్(24) దాడికి పాల్పడినట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు. శనివారం వెంకటరత్నమ్మ ఇంట్లోకి వెళ్లిన కిషోర్ బలాత్కరించి దాడికి పాల్పడ్డాడు. వెంకటరత్నమ్మ కేకలు వేయడంతో కిషోర్ పరారయ్యాడు. వెంకటరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు.

## వాయులింగేశ్వరుని సేవలో మాజీ డిఆర్‌డిఓ

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన వాయులింగేశ్వరుని శనివారం ఏరోస్పేస్ మరియు డిఫెన్స్,సలహాదారు, మాజీ చైర్మెన్, డిఆర్‌డిఓ సతీష్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయన ఆలయానికి రాగా ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి ఆయనకు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఏర్పాట్లును పర్యవేక్షకులు నాగభూషణం, సుబ్రమణ్యం టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి,హరికృష్ణ,సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.ఆలయ ఇఒ బాపిరెడ్డి తన ఛాంబర్‌లో స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు.

## క్రీడలతో శారీరక ధృఢత్వం



అడిషినల్ ఎస్పీ రవిమనోహర్ ఆచారి

రామచంద్రాపురం, డిశంబర్ 27 ప్రభాతవార్త: క్రీడలతో విద్యార్థులు శారీరక ధృఢత్వాన్ని పొందవచ్చని అడిషినల్ ఎస్పీ రవిమనోహర్ ఆచారి అన్నారు. శనివారం గీతాంజలి పాఠశాలలో శాప్ చైర్మన్ రవినాయుడుతో కలసి క్రీడా జ్యోతిని వెలిగించి, వార్షిక క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడలలో సైతం రాణించాలన్నారు. ఆటలలో క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. పోటీ ప్రపంచంలో నైపుణ్యాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

## రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలలో ఎస్‌జిఎస్‌కు ప్రథమస్థానం



తిరుపతి విద్య, డిసెంబర్ 27 ప్రభాతవార్త

గుంటూరు కేఎల్ వర్సిటీ వేదికగా సెట్విన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలలో ఎస్ జి ఎస్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శనివారం ప్రతిభచూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ బి సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించి ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపడం గర్వకారణమన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు జనవరి 10వ తేదీ నుంచి ఢిల్లీ వేదికగా జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాలల్లో అకడమిక్ విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ విద్యార్థులను ప్రొత్సహించి వారిలోని సృజనాత్మక శక్తిని వెలికితీసి ప్రొత్సహిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాధన్న,కొండలరావు,జగదీష్ కుమార్,ఉదయ్ ,కోటీశ్వరయ్య,చంద్రయ్య,భాస్కరన్, శివకుమార్, రాజేష్, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి కాంగ్రెస్ ఉమాంగ్ 2కే25 విజయవంతం

తిరుపతి విద్య,డిసెంబర్ 27 ప్రభాత వార్త





స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో స్టూడెంట్ కాంగ్రెస్ ఉమాంగ్ 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతపురం, హైదరాబాద్ ఐఈఈఈ సహకారంతో శనివారం కళాశాలల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ అకడమిషియన్లు, పరిశ్రమ నిపుణులు, పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యం, నూతన ఆవిష్కరణ దృక్పథం, నాయకత్వ లక్షణాలు, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వాసు, కన్వీనర్ డాక్టర్ మునిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడుగా పిసి రాయల్

తిరుపతి విద్య,డిసెంబర్ 27 ప్రభాత వార్త



తిరుపతికి చెందిన డాక్టర్ పి. సి. రాయులను దక్షి ణ మధ్య రైల్వే జోనల్ కన్స ల్టేటివ్ కమిటీ సభ్యుడిగా భారత ప్రభుత్వం, రైల్వే మంత్రిత్వ శాఖ నియమిం చింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.రెండేళ్ల కాల పరిమితి కలిగిన పదవిని నియమిస్తూ ఆయనను ఈ పదవి లో కొనసాగుతున్నట్లు పేర్కొంది.ఆయన గతంలో భారత ప్రభుత్వంలోని అనేక కీలక మంత్రిత్వ శాఖలు, చట్టబద్ధ సంస్థల్లో సభ్యుడిగా సేవలందించారు.ఆయన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తదితర సంస్థలలో సభ్యుడిగా పనిచేశారు.అదేవిధంగా బొగ్గు, ఉక్కు రంగాలకు సంబంధించిన సలహా మండళ్లు, ఫిల్మ్ సెన్సార్ బోర్డు, సంస్థలలో కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు.ఈ సందర్భంగా పి.సి.రాయులు మాట్లాడుతూ దక్షి ణ మధ్య రైల్వే యొక్క సమర్థవంతమైన కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంప్రదింపుల ప్రక్రియకు విలువైన సూచనలు అందిస్తానని పేర్కొన్నారు.

## పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

తిరుపతి విద్య,డిసెంబర్ 27 ప్రభాత వార్త



ఈనెల 31వతేదీ నుంచి నుంచి జనవరి 7వ తేదీవరకు జరిగే యూజీసీ నెట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఎస్వీయూ పరిధిలో వచ్చేనెల మొదటి వారంలో జరిగే పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్వీయూ పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేసి రెక్టార్ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కోకన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పీజీ మూడవ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులందరూ యూజీసీ నెట్ పరీక్ష రాయడానికి అర్హులేనని, చాలామంది విద్యార్థులు ఇప్పటికే యూజీసీ నెట్ కు సిద్ధమవుతూ పరిశోధన దిశగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఎన్టీఏ నిర్వహించే యూజీసీ నెట్ పరీక్ష తేదీలు దాదాపు నెల ముందే ప్రకటించినప్పటికీ,వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఎస్వీయూ అధికారులు పీజీ పరీక్షల షెడ్యూల్ ప్రకటించడం దారుణమని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షులు నరసన్న, జిల్లా కమిటీ సభ్యులు మాతేశ్వరి, యూనివర్సిటీ ఆఫీస్ బేరర్స్ తిరుమలేష్, భాను, వాసు, షేక్షావలి, శ్రీను నాయక్, వేణుగోపాల్, రాజు, మంజుల బాయి, లోవరాజు పాల్గొన్నారు.

## ఆయన సేవలు చిరస్మరణీయం

తిరుపతి విద్య,డిసెంబర్ 27 ప్రభాత వార్త



తెలుగు ప్రజలు గర్వించదగిన మహా సాహిత్యవేత్త శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులని ఆయన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్రెడ్డి కొనియాడారు. స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో "అన్నమయ్య సంకీర్తనలు ఆధ్యాత్మికత" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ అన్నమయ్య తెలుగు సాహిత్యానికి, భక్తి ఉద్యమానికి అందించిన సేవలు అనన్యసాధ్యమన్నారు. ఆయన సంకీర్తనలు నేటికీ ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కళాశాలలో అన్నమయ్య సాహిత్యంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించిన తెలుగు విభాగానికీ, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎన్. భీమన్నను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివరెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 100 తెలుగు, 10 ఆంగ్ల పరిశోధన పత్రాలు అందజేశారు.

## గృహ పిఎన్‌జీ ధరలను తగ్గించిన థింక్ గ్యాస్

తిరుపతి విద్య,డిసెంబర్ 27 ప్రభాత వార్త

పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డు ఏకీకృత టారిఫ్‌ను సవరించిన నేపథ్యంలో, థింక్ గ్యాస్ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి చిత్తూరు ప్రాంతంలో పిఎన్‌జీ ధరలను తగ్గిస్తున్నట్లు వెల్లడించింది, దీనితో ఈ ప్రాంతంలోని కుటుంబాలకు స్వచ్ఛమైన వంట మరింత సరసమైనదిగా మారింది. ఈ సవరించిన ధరలు 2026 జనవరి 1 నుండి అమల్లోకి వస్తాయి అని తెలిపారు.ఈ సందర్భంగా థింక్ గ్యాస్ చీఫ్ మార్కెటింగ్ అండ్ కమర్షియల్ ఆఫీసర్ వినుకుమార్ బాలకృష్ణన్ మాట్లాడుతూ, పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డు ఏకీకృత టారిఫ్‌ను సవరించడం వల్ల మేము మెరుగైన ధరలను వినియోగదారులకు అందించగలుగుతున్నాము అని అన్నారు. థింక్ గ్యాస్ ఈ ప్రాంతంలో వివిధ వినియోగదారుల అవగాహన, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని యోచిస్తోందని తెలిపారు.

## బలహీన వర్గాల సమిష్టి పోరాటాలతోనే జగన్ ఓటమి..

### బిసి నాయకుల ధ్వజం

శ్రీకాళహస్తి డిసెంబర్ 27 ప్రభాతవార్త

గత వైసిపి ప్రభుత్వ పాలనలో అణచివేతకు గురైన వారికి అండగా నిలవడం లోనూ, అరాచక జగన్ రెడ్డి తుగ్లక్ పాలనను అంతమొందించడంలోనూ బలహీన వర్గాల సమిష్టి పోరాటాలు అత్యంత క్రియాశీలకమైనవని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం ,అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి గుర్తు చేశారు. గత వైసిపి అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ప్రతీ పోరాటంలో ముందుండి పార్టీ శ్రేణులలో స్ఫూర్తిని నింపిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ బిసి నాయకుడైన రెడ్డివారి గురవారెడ్డిని ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమించిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి ఆధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీ, బిజెపి నాయకులు ఆయనకు ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల త్యాగాలే తెలుగుదేశం పార్టీకి మూలధనం అని, జగన్ రెడ్డి యొక్క రాజ్యాంగ వ్యతిరేక చర్యలను ఎదుర్కునే క్రమంలో తమ మాన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన గొప్ప కార్యకర్తలకు పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు యం.ఉమేష్ రావు,బీమాల భాస్కర్ ముదిరాజ్,డి.వి.నారాయణ, బిజెపి నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి,యస్వీ రమణ,వజ్రం కిషోర్,మునిరాజా యాదవ్,కోట చంద్రశేఖర్,ప్రముఖ న్యాయవాదులు సురేంద్ర ముదిరాజ్,అంకయ్య,బిసి మరియు యస్సీ విభాగం విభాగం నాయకులు జనార్ధన్ రెడ్డి,మణి,కుమార్,కూలి సన్నీ, రామకృష్ణ,సంజాకుల మురళీకృష్ణ,సుజిత్, సాయి నాయుడు, రమేష్,కృష్ణమూర్తి, నాగరాజు,శేఖర్,శంకరయ్య,పూల శేఖర్,సులేమాన్,భాస్కర్,ఆనంద్,గాజుల భగత్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రోడ్లు, ఇళ్ల పట్టాల సమస్యలపై సహకరించండి

నారాయణవనం, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలలో ప్రధాన సమస్య రోడ్ల మరమ్మతు సమస్యతో పాటు ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలను అందించి సహకరిం చాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వేంకటేశ్వర్లకి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు ఉమ్మ డి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమ న్‌కుమార్‌లు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గం లోని ఏడు మండలాల్లో రోడ్లు చాలా వరకు దుస్థితికి చేరిందని, వాటి మరమ్మతు చేపట్టాలని కోరారు. అలాగే పిచ్చాటూరు మండలం ఎఎస్ఎస్‌బీపేటలో భూ సమస్యను పరిష్కరించి అర్హులన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందించాలని కోరారు. జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్ మాట్లాడుతూ నారాయణవనం మండలం ఎరికంబట్టు రోడ్డు మరమ్మతుకు గురైందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

## అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టడం ప్రభుత్వం దుర్మార్గ చర్య



పుత్తూరు రూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త: అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టడం ప్రభుత్వం యొక్క దుర్మార్గ చర్య అని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత దుయ్యబట్టారు. ప్రజల ప్రయోజనాలకి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అప్పలరాజును ఉద్దేశపూర్వకంగా పీడీ యాక్ట్ పెట్టి తన అడ్డును తొలగించుకోవాలని ప్రభుత్వం భావించడం అన్యాయమని ఆమె అన్నారు. పీడీ యాక్ట్ అంటే ప్రజల మానప్రాణాలు, ధన దుర్వినియోగం చేసే వారిని, పీడీ యాక్ట్ పెడతారు, కానీ ఉద్యమకారులపై కేసులు పెట్టడం ఏమిటని అన్నారు.సీపీఎంనాయకులువెంకటేష్,సీపీఐ నాయకులు మహేష్, మునిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ, కుల సంఘం పటిష్టతకు కలసి రావాలి

విజయపురం (నగరి), డిసెంబరు 27 ప్రభాతవార్త:



కమ్మ, కుల సంఘం ఐక్యత, పటిష్టతకు ప్రతి ఒక్కరు కలసి రావాలని పిలుపునిచ్చారు. శనివారం నగరి సమీపంలోని సాయిబాబా కల్యాణ మందిరంలో నగరి నియోజకవర్గ కమ్మ సేవా సమితి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్మ కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నారని, అందులో ఆర్థికంగా ఉన్న వారు కొందరైతే, లేని వారు ఎందరో ఉన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కమ్మ కులస్తుల కష్టసుఖాల్లో పాలు పంచుకోవడానికి ఒక సంఘం అంటూ ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆలోచనతోనే ఇక్కడ ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కమ్మ కుల సంఘం ఏర్పాటు చేసుకుని తద్వారా కమ్మ కులస్తుల్లోని పేదలకు విద్య, వైద్యం అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అదే స్ఫూర్తితో కమ్మ వారంతా ఐక్యతతో సంఘం ఏర్పాటు చేసుకుని మన పేదలకు సాయం చేసి ఆదుకుంటే మనకందరికి పేరు ప్రతిష్టలతో పాటు సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రసాద్ బాబు, లక్ష్మీపతి, జయచంద్ర నాయుడు, పురుషోత్తం నాయుడు, డిల్లీబాబు ముందుకు రాగా నగరి నియోజకవర్గం నుంచి చుట్టు పక్కల నియోజకవర్గం నుంచి పలువురు కమ్మ సోదరుల వందలాది మంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కేవీబీపురం, డిసెంబరు 27 ప్రభాతవార్త:



మండలంలోని కళత్తూరు గ్రామ పంచాయతీ కళత్తూరు గ్రామంలో శనివారం ఉదయం స్వర్గీయ కళత్తూరు కృష్ణారెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కృష్ణారెడ్డి కుమారులు లీలా చంద్రారెడ్డి, ఉదయభాస్కర్ కుటుంబ సభ్యులచే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య కంటి శిబిరానికి 150 మంది ఉచిత కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. వారిలో 24 మంది కంటి ఆపరేషన్‌లకు రెఫరల్ చేయడం జరిగిందని వైద్య సిబ్బంది తెలిపారు. కంటి వైద్య నిర్వాహకులకు గ్రామ పంచాయతీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అరవింద సొసైటీ తిరుపతి శాఖ డా. రవళి, ఎల్.సూర్యనారాయణశెట్టి, సీఎస్‌డీసీఎస్‌వో సంస్థ ఆర్ఎస్ చంద్రశేఖర్, ఉదయభాస్కర్ గ్రామీణ వికాస సమితి తిరుపతి కార్యదర్శి మునిరమణారెడ్డి, లీలాచంద్రారెడ్డి, లోకనాథంరెడ్డి, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలను సందర్శించిన టీడీపీ నాయకులు

సత్యవేడు, డిసెంబరు 27 ప్రభాతవార్త:



సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు స్థానిక టీడీపీ నాయకుల బృందం శనివారం సందర్శించింది. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు, మురళి (చికెన్ చిన్న), తులసిరామ్, దిలీప్, దయ, సునీ ల్‌జైన్, కోనయ్య, విక్రమ్ తదితరులు ఆస్పత్రి అభి వృద్ధి సలహా అసోసియేషన్ సభ్యులు హేమభూషణ్, ధనతో కలసి ఆస్పత్రి సందర్శించి అక్కడ సమస్యలను ఆరా తీశారు. ప్రధానంగా ఆస్పత్రిలో విద్యుద్దీకరణ అస్తవ్యస్తంగా ఉండడాన్ని గుర్తించారు. అలాగే భవనానికి కొన్నేళ్లుగా రంగులు వేయకపోవడం వల్ల కూడా వెలవెల పోతున్నట్లు గుర్తించడం జరిగింది. దీంతో పాటు మరమ్మతుకు గురైన మినరల్ వాటర్ ప్లాంట్‌ని దాతలు ద్వారా బాగు చేయించడానికి చొరవ చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అవసరమైన వసతులు, వైద్యులకు అవసరమైన పరికరాలకు సంబంధించి తగిన ప్రతిపాదన రూపొందించి సమర్పించాలని వైద్యాధికారి సాహుల్‌ని కోరారు. అంతకు ముందు టీడీపీ నాయకుల బృందం ప్రభుత్వాస్పత్రిలోని వివిధ వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్యాన్ని ఆరా తీసి దీనిపై వైద్యులతో చర్చించారు.

## కార్వేటినగరంలో వృద్దులకు అన్నదానం

కార్వేటినగరం,డిసెంబరు 27 ప్రభాతవార్త:



కార్వేటినగరం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీ ఆశ్రమంలోని వృద్దులకు ఓ కుటుంబం అన్నదానం నిర్వహించారు.కార్వేటినగరం మండలం కె,యం,పురం పంచాయితి పరిధిలోని గొల్లకండ్రిగ గ్రామానికి చెందిన మునిరత్నంయాదవ్ 28వ వర్ధంతి సందర్భంగా వృద్దులకు అన్నదానం,పండ్లు,తినుబండారాలు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో శైలజ,గంగాభవాని, ముక్తాశ్రీహేమకృతిక, దీక్షిత్,ధీరజ్,దయాసాగర్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమంలో సూపర్ వైజర్ ప్రకాష్,వృద్దులు పాల్గొన్నారు.

## ఎన్. శాంతి సుధకు డాక్టరేట్



తిరుపతియూనివర్సిటీ, డిసెంబర్ 27 (ప్రభాతవార్త)

పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం పరిశోధనా విద్యార్థి ఎన్. శాంతి సుధకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ అఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె డా. అనురాధ మార్గ దర్శకత్వం లో తిరుపతి నగరంలోని ప్రీయూనివర్శిటీ కళాశాల విద్యార్థులలో వ్యక్తుల మధ్య నైపుణ్యాలు మరియు విద్యా పనితీరుపై సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌ల ప్రభావం" అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్. శాంతి సుధ ను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

## గురూజీ ఆశ్రమంలో ముగిసిన అష్టలక్ష్మి హోమం

రామచంద్రాపురం, డిశంబర్ 27 ప్రభాతవార్త:



సి.రామాపురంలోని శ్రీబ్రహ్మర్షి గురువానంద గురూజీ ఆశ్రమంలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి హోమాలు శనివారంతో ముగిశాయి. గురువానంద గురూజీ అష్టలక్ష్మిదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలకు చేరుకుని రుత్వికుల వేదమంత్రోచ్చారణల నడుమపూర్ణాహుతిసమర్పించారు.ఆశ్రమానికి విచ్చేసినభక్తులనుఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## బ్లైండ్ అసోసియేషన్‌చే సంక్షేమ కార్యక్రమాలు

తిరుపతి క్రీడ, డిసెంబర్ 27, ప్రభాతవార్త

తిరుపతి ఎస్‌వి ఆర్ట్స్ కాలేజ్, గ్రౌండ్లో జరుగుతున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం పేద పిల్లలకు ఆర్థిక సాయం, ఉద్యోగం పెట్టడం వంటి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రెసిడెంట్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 26, 27 తేదీల్లో అందుల క్రీడలను నిర్వహించారు. ఇందులో సుమారు 300 మంది బ్లైండ్ బాల బాలికలు క్రీడాకారులు పాల్గొన్నారు. క్రికెట్, కబడ్డీ, చెస్, రన్నింగ్ రేస్, క్విజ్, రీడింగ్, రైటింగ్, టేగ్ ఆఫర్,అనేక క్రీడలను నిర్వహించారు. క్రీడాకారులు సంతోషంగా క్రీడల్లో పాల్గొని పథకాలను సాధించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలపై సాధ్యమైనంత వరకు పరిష్కారం ఉంటుందని చెప్పారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని వేదికగా ఉపయోగించు కోవాలని సూచించారు. సూళ్లూరు ప్రాంతంలోని సుమారు మూడువేల కుటుంబాల వారికి స్థానికంగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో పక్కాఇళ్లు నిర్మించుకునేందుకు అవస్థలు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. 34 ఎకరాల్లో మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికీ తాము మున్సిపల్ పన్నులతో పాటు కరెంటు బిల్లులు ఎంతోకాలంగా చెల్లిస్తున్నప్పటికీ తమకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడంలో అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూకి సంబంధించి 13 అర్జీలు, మున్సిపాలిటీకి సంబంధించి 2 అర్జీలు, ఎంపిడిఒకు సంబంధించి రెండు అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 5 అర్జీలు వచ్చాయి. మాజీ ఎంపీ



నెలవల సుబ్రహ్మణ్యం, ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, టిడిపి నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పి.మాధవనాయుడు, సుబ్రహ్మణ్యం, కొండలరావు, ఆలీభాయ్, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రైతులు భూములకు సర్వే చేయించుకోండి

కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త

కోట మండలం చెందోడు గ్రామంలో శనివారం సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహశీల్దార్ కె.జయజయరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పొరపాట్లను సరిదిద్దేందుకు రైతు సమస్యలను గుర్తించి వారి భూములను రీసర్వే చేసేందుకు ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్టును ప్రవేశపెట్టిందని తెలిపారు. జనవరి 2వ తేదీ నుంచి కోట మండలంలోని చెందోడు, గూడలి, మద్దాలి, రుద్రవరం, సిద్ధవరం పంచాయతీల్లో ఈ సర్వే జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపీరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబర్ 27, ప్రభాతవార్త



ప్రజాదర్బార్‌లో సమస్యలపై వచ్చిన వినతి పత్రాలు పరిశీలించి త్వరిత గజన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ఎమ్మెల్యే నివాస గృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి శుక్రవారం ప్రజాదర్బాలను నిర్వహించి సమస్యల చేరుకొని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు ప్రజా దర్బార్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. భూ సమస్యలు, తాగునీరు తదితర వాటిపై వినతి పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు సత్యనారాయణ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంలో న్యాయం చేయలేదని టిడిపి నేత ధర్నా

వాకాడు, డిసెంబర్ 27, ప్రభాతవార్త



భూ వివాదంలో అధికారులు న్యాయం చేయలేదని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అయోధ్య బాలచంద్రయ్య శెట్టి, ఆయన భార్య కలిసి ధర్నా చేపట్టారు. శనివారం మండల కేంద్రమైన వాకాడు అశోక్ పిల్ల సెంటర్ సమీపంలో వాకాడు మండలం గంగనపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అయోధ్య బాలచంద్రయ్య శెట్టి దంపతులు భూ వివాదంలో రెవెన్యూ అధికారులు, న్యాయం చేయలేదని రోడ్డు మీద ధర్నా చేపట్టారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు మరణాంతరం నా పేరు మీద భూమి పాస్పుక్కులు చేయాలంటూ రెవెన్యూ అధికారులు తెలియజేశానని తెలిపారు. ఎన్నోసార్లు అడిగిన చేయలేదని అన్నారు. కొన్ని రోజులు తర్వాత మీ కుటుంబ గొడవలు ఉన్నాయని, కోర్టులో ఉందని తెలిపారు అన్నారు. నేను బాధ ఆవేదనతో నాకు ఎవరు న్యాయం చేయలేదంటూ, గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు మా చెల్లెలు మీద ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు, ఈ ప్రభుత్వమే నన్ను ఆదుకోవాలని ధర్నాకు దిగానని తెలిపారు. అధికారులు పట్టించుకునేంత వరకు దీక్ష చేస్తానని తెలిపారు.

## క్రీడాకారులుకు ఘన సత్కారం

గూడూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త



కేరళ రాష్ట్రంలోని కాసరగూడలో జరిగిన జాతీయ స్థాయి 37వ సబ్ జూనియర్ స్థాయి టెన్నికాయిట్ పోటీలలో విజేతలుగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ క్రీడాకారులను తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్) సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.యన్.వి సత్యనారాయణ, టీం మేనేజర్ పి తవిటయ్య, చీఫ్ కోచ్ నేషనల్ రెఫరీ కె రమేష్‌లను ఘనంగా సన్మానించారు. ఈయన వెంట అసోసియేషన్ ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వర రావు, ఈ.సి మెంబర్లు విజయ లక్ష్మి, తదితరులు ఉన్నారు.

## అంజనీ టైల్స్ ఇండస్ట్రీలో ఉపాధి అవకాశాలు కల్పించాలి

చిల్లకూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త




మండలంలోని పునపరివారిపాలెం గ్రామంలో ప్రముఖ టైల్స్ పరిశ్రమ అంజనీ టైల్స్ ఇండస్ట్రీని సందర్శించి లోకల్‌గా ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ఇవ్వాలని యాజమాన్యంకు తెలపాలని శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్‌కు వినతి పత్రం అందజేసారు. పునపరివారిపాలెం గ్రామం నందు ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వారి సమస్యల అర్జీలను తీసుకుని సంబంధిత అధికారులకు తెలిపి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేద తానంకి నానాజీ, తాసిల్దార్ కే శ్రీనివాసులు, ఎంపీడీవో పి గోపి, నాయకులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, గంట మధుకృష్ణ, మట్టం శ్రావణి రెడ్డి, గుండాల లీలావతి, గూడూరు సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, కొండూరు పిచ్చిరాజు, కాకి రవి, ఆనంగి లీలా కుమార్, కోట సతీష్, కందల అర్చన, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణం చేపడుతున్నాం : ఎమ్మెల్యే పాశం

చిల్లకూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త



గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. చిల్లకూరు మండలంలోని బూదనం జాతీయ రహదారి నుండి పున్నపువారిపాళెం వరకు చేపట్టే రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. చిల్లకూరు మండలంలోని బూదనం సమీపంలోని జాతీయ రహదారి నుండి పున్నపువారిపాళెం ప్రాంతం వరకు అంటే రెండు కిలో మీటర్లకు పైగా ఉపాధి హామీ నిధుల కింద రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణానికి 4 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ నేపద్యంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, పెంచలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తానంకి నానాజీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాసిల్దార్ కే శ్రీనివాసులు, ఎంపీడీవో పి గోపి, టిడిపి మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, నాయకులు మట్టం శ్రావణి రెడ్డి, గుండాల శ్రీదేవి, గుండాల లీలావతి, గంటా మధుక్రిష్ణ, కీరవాణి, పట్టాభిరామి రెడ్డి, జానకిరామి రెడ్డి పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు కాకి రవి, లీలా కుమార్, పెనుబోలు జానకి రామిరెడ్డి, ఎదనపత్తి భాస్కర్ రెడ్డి, ఓడూరు సత్యనారాయణ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా చేయాలన్న ప్రతిపాదన ఉంది : ఎమ్మెల్సీ

వెంకటగిరి, డిసెంబర్ 27, ప్రభాతవార్త



గూడూరు నియోజకవర్గం జిల్లాగా చేయడం లేక నెల్లూరు జిల్లాలోనే ఉంచడం అనే అంశం ప్రభుత్వ ప్రతిపాదనలో ఉందని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలోని గూడూరు నియోజకవర్గానికి సంబంధించిన పరిపాలనా అంశాలపై రాష్ట్ర శాసనమండలిలో చేసిన ప్రత్యేక ప్రస్తావనకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యదర్శి ప్రసన్న కుమార్ సూర్యదేవర ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తికి లేఖ రాసి సమాచారం అందజేశారు. లేఖలో, గూడూరును కేంద్రంగా 20 మండలాలతో జిల్లా ఏర్పాటు చేయడం లేదా గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లా నుంచి నెల్లూరు జిల్లాకు మార్చడం వంటి అంశాలపై సంబంధిత శాఖల నుంచి పూర్తి వివరాలు సేకరించి, ఎమ్మెల్సీ వినతిని పరిశీలించాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారికంగా సూచించినట్లు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి 27.09.2025న శాసనమండలిలో ప్రస్తావిస్తూ, గూడూరు ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, ఇచ్చిన హామీల మేరకు గూడూరును కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని లేదా తిరుపతి జిల్లా నుండి నెల్లూరు జిల్లాకు మార్పు చేయాలని కోరారు.

## నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గూడూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త




నారాయణ ఇంజనీరింగ్ కళాశాల గూడూరు ఎన్ఎస్ఎస్ యూనిట్ వారు, నారాయణ మెడికల్ కళాశాల నెల్లూరు, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ గూడూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుండి సాయంత్రం వరకు 120 మంది విద్యార్థులు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.విశ్వక్సేన రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు యువతలో మానవీయ విలువలను పెంపొందిస్తాయని, ఈ కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ తరపున నిర్వహించి దేశాభివృద్ధికి తోడ్పడుతున్నందుకు తమ కళాశాల విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యశోదవర్ధన్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ప్రతినిధి ఎ.లక్ష్మీనారాయణ, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి యన్. కోటేశ్వర్ రావు, ఎ.ఓ. కొండారెడ్డి, ఎ. ఓ.యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నేత సన్నారెడ్డి వెంకటరమణ రెడ్డి ప్రథమ వర్ధంతి

చిల్లకూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త

మండలంలోని రామారెడ్డి పాలెం గ్రామం నందు జరుగుతున్న సీనియర్ నాయకులు సన్నారెడ్డి వెంకటరమణ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలోపెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మెన్ తానంకి నానాజీ పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని పార్టీకి ఆ కుటుంబానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత తానంకి నానాజీ, రాజశేఖర్ రెడ్డి, ఓడూరు సత్యనారాయణ రెడ్డి, చిల్లకూరు పట్టాభిరామి రెడ్డి, జానకిరామ్ రెడ్డి, అన్న మునిశేఖర్, గంట మధు కృష్ణ, గుండాల లీలావతి, కందల అర్చన, ఎస్‌వీఆర్ కుటుంబ సభ్యులు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఉచిత భోజనం

సూళ్లూరుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు ఉచితంగా భోజనం అందించే పథకాన్ని శనివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలోని పేదలకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని మూడు పూటలా ఆసుపత్రిలో అందజేస్తారని ఆమె తెలిపారు. అనంతరం రోగులను కలిసి వారి క్షేమ సమాచారాలు విచారించి మధ్యాహ్నం భోజనాన్ని అందజేశారు. ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, టిడిపి నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పి.మాధవనాయుడు, సుబ్రహ్మణ్యం, కొండలరావు, ఆలీభాయ్, వెంకటేశ్ యాదవ్, ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో సిపిఎం నిరసన

సూళ్లూరుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త

సిపిఎం నేత అప్పలరాజును పీడీ యాక్ట్ పెట్టి అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ స్థానిక సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా అక్కడి బాధితులకు అండగా అప్పలరాజు పోరాడుతుంటే కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న రాష్ట్రప్రభుత్వం అప్పలరాజుపై లేనిపోని అభియోగాలు మోపి పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేశారని తెలిపారు. అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అల్లెయ్య, ఎస్‌కె రియాజ్, కె.సాంబశివయ్య, సీహెచ్ సుధాకర్‌రావు, అక్బర్‌బాషా, ఖాన్, భాస్కర్, ఫయాజ్, అమీర్, మాలిక్, కరీమ్, బాలాజీ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలి

తడ, డిసెంబర్ 27, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రాజెక్ట్ ని సద్వినియోగం చేసుకోవాలని తడ తహసిల్దార్ శరత్ బాబు తెలియజేశారు శనివారం మండల పరిధిలోని మాంబట్టు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు జనవరి నెల నుండి గ్రామంలో రీసర్వే మొదలవుతుందని సర్వేకు రైతులు సహకరించాలని సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విచారణ జరిపి గ్రామసభ నిర్వహించి మార్పులు చేర్పులు చేయడం జరుగుతుందని తెలియజేశారు. మాంబట్టు గ్రామంలో రీసర్వే పై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు మాజీ సర్పంచ్ వేనాటి రాజారెడ్డి, ఆయకట్టు సర్పంచ్ చిల్లకూరు సురేష్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

తడ, డిసెంబర్ 27 ప్రభాతవార్త



మండలం అనపగుంట గ్రామంలో కొద్దిరోజుల క్రితం అనారోగ్య కారణంతో చెల్లయ్య అనే వ్యక్తి మరణించారు. వారి కుటుంబానికి వారి మిత్ర బృందం 1994 సంవత్సరం పదవ తరగతి స్నేహితులు కలసి చెల్లయ్య కుటుంబానికి 45 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో గుణశేఖర్, శ్రీహరి, భాస్కర్, జోసెఫ్, చంద్రమోహన్, రమేష్, నిర్మల్, అప్సర్, సుధాకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణే ప్రభుత్వ ధ్యేయం: డీఎస్పీ

గూడూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త

గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా గూడూరు డీఎస్పీ గీతా కుమారి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, సి.డి ఫైళ్లు, స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రతను సవివరంగా పరిశీలించారు. అలాగే లా అండ్ ఆర్డర్ సమర్థవంతంగా నిర్వహించడం, ఆస్తి నేరాల గుర్తింపు, నియంత్రణపై సిబ్బందికి తగిన సూచనలను తెలియచేశారు. ఈమె వెంట గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి లక్ష తులసి పూజ

గూడూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రాజా వీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గోవిందమాల అన్నదాన సేవా సమి తి అధ్వర్యంలో శనివారం ఉద యం శ్రీవారికి లక్ష తులసి పూజ వైభవం గా జరిగింది. భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ చైర్మన్ శ్రీకంటి రామ్మోహన్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాణిపాకం గోశాలలో చైర్మన్,ఈఓలు ఆకస్మిక తనిఖీలు

కాణిపాకం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం గోశాలను ఆలయ చైర్మన్ మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు శనివారం సాయం త్రం ఆకస్మికంగా విస్తృత తనిఖీలు నిర్వ హించారు. ఈసందర్భంగా గోశాలలోని రికార్డు లను పరిశీలించారు. అలాగే గోశాలకు ప్రతి రోజూ సరఫరా అవుతున్న పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణా తదతర వివరాలను పరిశీలించారు. అలాగే గోశాలలోని గోవులకు సకాలంలో గడ్డి, దాణా అందిస్తున్నారా? లేదా; అనే విషయాలను పరిశీలించారు. గోశాలకు పచ్చిగడ్డి సరఫరా చేసే కాంట్రాక్టర్ గడ్డి కొరత పేరుతో గత కొద్ది రోజులుగా పచి ్చగడ్డిని సక్రమంగా సరఫరా చేయకపోవడాన్ని గుర్తించారు. దీనితో ప్రత్యామన్నయ ఏర్పాట్లు చేపట్టాలని గోశాల అధికారులను ఆదేశించారు. అవసరమైతే దేవస్థానం తరపున నేరుగా ఇతర ప్రాంతాల్లో పచ్చిగడ్డిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గోశాల ఏఈఓ ధనుంజయ, సూపరెండెంట్ వాసు, గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నయన మనోహరంగా భానుజా మణివణ్ణన్

### కూచిపూడి నృత్యప్రదర్శన



తిరుపతి,డిసెంబర్ 27ప్రభాతవార్త:

రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగుతున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో భాగంగా శుక్ర,శనివారం పలు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన కుమారి భానుజా మణివణ్ణన్ వరుసగా రెండురోజులు సాయంత్రం కూచిపూడి నృత్యప్రదర్శన గావించింది. త్యాగరాజ కీర్తనయైన ఎందరో మహానుభావులు, అలాగే భో శంభో వంటి కీర్తనలకు నయన మనోహరంగా కూచిపూడి నృత్యప్రదర్శన గావించి ప్రేక్షకులను ఆద్యంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. భారతీయ విద్యాభవన్, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు, మిమిక్రి, ఆంధ్ర నాట్యం లాంటి పలు కార్యక్రమాలు ప్రేక్షకులకు మనోరంజకంగా నిలిచాయి.

## షణ్ముగంరెడ్డికి ఘన సన్మానం

పుత్తూరు రూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:



నూతనంగా ఎన్నికైన చిత్తూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డిని బంగారుపాళెం మార్కెట్ యార్డు చైర్మన్ భాస్కర్‌నాయుడు స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలను గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షులను చేసి బీసీల పక్షిపాతిగా నిలిచిందని తెలియజేశారు.అదే విధంగా ఎంతన్నది సీనియర్ ఉన్న యువకులకు ఇవ్వడంతో కొత్త తరానికి నాంది పలికిందని తెలియజేశారు. తవణంపల్లి మండల పీఏసీఎస్ చైర్మన్ అమరేంద్రనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ సుధాకర్, ఏఎంసీ డైరెక్టర్ జగదీష్, గురజాల, చిట్టెమ్మ, నీలిమ, హరి, తెలుగుదేశం పార్టీనాయకులు చైతన్య, మధు నాయుడు, లోకనాథంనాయుడు, విక్రమ్, కరియావుల, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, లోకనాథరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

## పవిత్ర ధనుర్మాసంలో వైభవంగా నగర సంకీర్తన

తిరుపతి,డిసెంబర్ 27ప్రభాతవార్త:




ప్రతి శనివారం ఉదయం తిరుపతి పురవీధులు గోవింద నామాలతో మార్మోగుతున్నాయి.. శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి క్షేత్రంలో అడుగడుగునా భక్తి భావం పెంపొందించాలన్న సంకల్పంతో స్థానిక భజన మండలి కళాకారులు శ్రీవారికి ఎంతో ఇష్టమైన ధనుర్మాసంలో శనివారం రోజున నగర సంకీర్తన చేస్తున్నారు. వందమందికి పైగా భజన మండలి కళాకారులు ప్రతి శనివారం ఉదయం ఐదు గంటలకి సాంప్రదాయ వస్త్రాలతో నుదుటిపైన గోవింద నామాలతో స్థానిక గోవిందరాజస్వామి ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి,వాసుదేవ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,మేకల గంగయ్య ,నరసింహారెడ్డి, ధనంజయ రెడ్డి ,కొండే చెంగారెడ్డి ,మునినాథరెడ్డి ,భాస్కరాచారి మురళి, తొండము నాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, ,మధు చంద్రబాబు నాయుడు, పొన్నాల జెజిరెడ్డి , పద్మావతి ,సిద్ధమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి, మునేంద్ర రెడ్డి రెడ్డి బాబు, కల్పన తదితర భక్తులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌రాజుసేవలు అమూల్యం

తిరుమల,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:



పార్టీకి ఎనలేని సేవలు చేసిన ,తొలినుండి పార్టీలోనే ఉన్న ఎన్టీఆర్ రాజు లేనిలోటు బాధాకం మని పలువురు టిడిపి నేతలు పేర్కొన్నారు. తిరుమలవాసి,టిడిపి అభిమాని ఎన్టీఆర్ రాజు దివంగతులు కావడంతో శనివారం తిరుమలలోని ఆయన నివాస గృహంలో ఉత్తరక్రియలు నిర్వహించారు. ఆయన సేవలను పలువురు కొని యాడారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ రాజు చిత్రపటానికి నందమూరి రామకృష్ణ, పలువురు నేతలు పనబాకలక్ష్మి, తుడ దివాకర్‌రెడ్డి, కూటమి పార్టీల నాయకులు ,,కార్యకర్తలు, బంధువులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. రాష్ట్రపార్టీ మీడియాకోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ ను ఆయన సోదరులను నేతుల ఓదార్చారు. కాగా శుక్రవారం తిరుపతిలో సిఎం చంద్రబాబునాయుడు శ్రీధర్‌వర్మ ఇంటికి వెళ్ళి రాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శ్రీధర్‌వర్మను సిఎం పలకరించి ఓదార్చి ధైర్యం కల్పించారు.

## కుప్పంలో లక్ష మెజార్టీ లక్ష్యంగా పనిచేయాలి : కంచర్ల

రామకుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త




సిఎం చంద్రబాబునాయుడుకు వచ్చే ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీ సాధనేలక్ష్యంగా పార్టీ శ్రేణులు కలసికట్టుగా పనిచేయాలని ప్రభుత్వవిప్, కడపిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో టిడిపి మండల స్థాయి సమావేశం నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచే కుప్పంలో తెదేపా బలపడుతూ వస్తోందన్నారు. ముమ్మందు మరింతబలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈస ందర్భంగా పాతిక కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పట్రనారాయణ, వెంకటరమణ, కామరాజునాయక్, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, గుర్రప్ప, వెంకటరామగౌడు, సీతాపతి, చలపతి, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బండారుపల్లిలో గుజరాత్‌టీం పరిశీలన

ఏర్పేడు,డిసెంబర్ 27 ప్రభాతవార్త



రాష్ట్రంలో జరుగుతున్న పలు పథకాల అమలుకు సం బంధించి దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలు ఆసక్తిగా పరి శీలిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడ అమలు జరు గుతున్న విద్యావిధానాలకు సంబందించి యువ మంత్రి నిర్ణయాల ఫలితాల గురించి గమనిస్తున్నారు.ఈ నేపథ్యంలో శనివారం గుజరాత్‌కు చెందిన ఓ ప్రత్యేక బృందం ఏర్పేడు మండలంలోని బండారుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఇక్కడ ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న విద్యావిధానం అలాగే మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.వారికి హిందీలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు చిట్టిబాబు, ద్వారకానాథ్‌రెడ్డి, కుమార్‌రాజ, రాధాకుమారి, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పక్షుల పండగ నిర్వహణపై సమీక్ష

తడ, డిసెంబర్ 27, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ఫ్లెమింగో ఫెస్టివల్ పక్షుల పండగ జనవరి 10, 11వ తేదీలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తరుణంలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణపై మండల ఎంపీడీవో శేఖర్ నాయక్, ఎంపీపీ రఘు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు భీములవారిపాలెం పడవ రేవు వద్ద చేపట్టవలసిన కార్యక్రమాల గురించి అదేవిధంగా హైవేకి ఆనుకుని ఉన్న గ్రామాలలో పారిశుద్ధం పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే అవకాశం ఉందని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సూచించారు.

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఘన స్వాగతం....

రేణిగుంట డిసెంబర్ 27 ప్రభాతవార్త..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ కు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సత్య కుమార్ కు విమానాశ్రయంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రేణిగుంట మండల బిజెపి యువ మోర్చా అధ్యక్షుడు బొమ్మి శ్రీకాంత్, రేణిగుంట మండల బిజెపి ఉపాధ్యక్షుడు రాజా రాయల్, రేణిగుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్ రాయల్, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గంలో

